క్లుప్తంగా

తూర్పుగార్లపాడులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే



రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడులో ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. అర్హులు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోగా.. వారికి ఇల్లు ఉందా? లేదా? అనే అంశాలతో పాటుగా, ప్రస్తుతం వారు ఉంటున్న నివాసాలను పరిశీలించారు. అర్హులందరికీ న్యాయం చేసేలా పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ జమ్మన్న తదిదరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు గురువారం చేపట్టారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ.10 లక్షలు మంజూరైనట్లు ఏఈ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, గ్రామస్తులు సత్యనారాయణరెడ్డి, మద్దిలేటి, పెద్దనరసింహులు, వెంకటేష్, బతుకన్న, సోములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అలంపూర్: సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కులను ఎమ్మెల్యే విజయుడు ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి నివాసంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని రాజోలి, వడ్డేపల్లి, మానవపాడు మండలాలకు చెందిన 10 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.1,79,500 విలువైన చెక్కులు వచ్చినట్లు తెలిపారు.

టీచర్ కొట్టడంతో చిన్నారి శరీరంపై వాతలు



అయిజ: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న విరాట్ శంకర్‌నాయక్‌ను టీచర్ మానస బుధవారం కర్రతో కొట్టడంతో చిన్నారి చర్మంపై వాతలు పడ్డాయి. అయితే చిన్నారి తల్లిదండ్రులు జ్యోతి, కృష్ణారావు గురువారం పాఠశాలకు వెళ్లి కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో, ఎంఈఓ రాములుకు ఫిర్యాదు పత్రం అందించారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి తెలిపారు. ఘటన వివరాలను డీఈఓకు తెలియజేస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ పేర్కొన్నారు. విద్యార్థి అల్లరి చేస్తుంటే నివారించేందుకు టీచర్ కర్రతో కొట్టినట్లు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఆత్మకూర్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సమస్యలన్నింటిని పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్ర నాయకుడు హన్మంతు, జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా నేటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. మక్బూల్, సత్యన్న, ఇస్మాయిల్, కృష్ణ, మహమ్మద్, వెంకటన్న ఉన్నారు.

గురువుకు విద్యార్థుల వీడ్కోలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ బోధిస్తున్న అసుదున్నిసాబేగం ఉద్యోగ విరమణ చేస్తుండడంతో ప్రధానోపాధ్యాయులు హేమలత ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివ ప్రసాద్, రామకృష్ణ, అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు సువార్త, వెంకటేశ్వర్లు, అనితాబాయి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు కృషి

మల్దకల్: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి అని, దానిని నిర్లక్ష్యం చేయకుండా తొలిదశలోనే నిర్మూలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు గౌసియా, ఆశాలు శేషమ్మ, సుధారాణి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: కుష్ఠు వ్యాధిపై వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ భాస్కర్, డాక్టర్ యాకుబ్‌భాషా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, మాబి, జయమ్మ, దేవమ్మ, ప్రసన్న, పుష్పలత, సుహాసిని, వినోదిని పాల్గొన్నారు.

శాంతినగర్: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎన్ఎం సుజాత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురం ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్త, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలనకు పాటుపడతామని అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు.



మానవపాడులో కుష్ఠుపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు



ఇటిక్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

క్షయ వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం క్షయ వ్యాధి నివారణపై డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారిని గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స పూర్తయ్యేంత వరకు ప్రతి నెల వ్యాధిగ్రస్తులకు రూ.500 ను పోషణ భత్యం కింద ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

మానవపాడు: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఏఎంవీఐలు అమృతవర్షిణి, సైదా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు నివారించడానికి రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, రంగోళి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ అనురాధ, కానిస్టేబుల్ కృష్ణకుమార్, హెంగార్డు ఖాదర్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అమృతవర్షిణి, సైదా

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్ర బాబు

ధరూరు: పాఠశాలలకు వచ్చే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాల, ఎములోనిపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయం సమీపిస్తుండడంతో సమయాన్ని వృథా చేసుకోకుండా మంచిగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1 నుంచి నుంచి మార్చి 20వ తేదీ వరకు సాయంత్రం పూట స్నాక్స్ అందించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు.

ఆలయాలకు పూజా సామగ్రి అందజేత

శాంతినగర్: వేద విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో శాంతినగర్ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ సముదాయంలోని శివాలయానికి గురువారం పూజా సామగ్రి అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆలయాలకు అందించే పూజాసామగ్రిలో భాగంగా శాంతినగర్ శివాలయాన్ని ఎంపిక చేసి ఆలయ అర్చకుడు వినయ్‌కౌశిల్‌శర్మకు సామగ్రి అందజేస్తున్నట్లు శ్రీవారి సేవకులు యిట్యూరి శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో మాణిక్యం వెంకటేశ్వర్లు, మధుసూదన్‌శెట్టి, ఉపాధ్యాయులు వెంకట్రావు, రామచంద్రుడు, గొంగళ్ల రాముడు, మదన్, మద్దిలేటి, మహానంది, పూర్ణిమ, విజయకుమారి, శాంత, రజిత, ఉమాదేవి పాల్గొన్నారు.



అర్చకుడు వినయ్‌కౌశిల్ శర్మకు పూజ సామగ్రి అందజేస్తున్న యిట్యూరి శ్రీనివాసులు

'ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి'



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలన్నీ నెరవేర్చాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని, దద్దమ్మ ప్రభుత్వం ఇంటికి పంపించేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. పాలన చేతకాని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని గాంధీ మహాత్ముడి విగ్రహం ఎదుట మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, పట్టణ అధ్యక్షుడు వీరేష్, వెంకటేష్, మాధవ్, పరశురాముడు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు



రాజోళి: మండలంలోని నసనూరులో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యులు పాడి రైతులకు పలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా పశువైద్యులు మాట్లాడుతూ పాడి రైతులు టీకాలను సద్వినియోగం చేసుకొని పాడిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అవస్థలు



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మౌలిక వసతులు లేకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 3 నుంచి ఆరేళ్ల వయస్సు గల పిల్లలు 16 మంది, గర్భిణులు ఆరుగురు, బాలింతలు ఆరుగురు పేర్లు నమోదు చేసుకున్నారు. వీరందరూ ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తుండడంతో మరుగుదొడ్లు, నీటి వసతి లేకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం మరుగుదొడ్లు నిర్మించినా.. వాటికి నీటి వసతి కల్పించలేదు. దానివల్ల ఇంతకాలం నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు మరుగుదొడ్ల గోడలు శిథిలమయ్యాయి. వాటికి తలుపుకు కూడా లేవు. సమస్య గురించి ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

విగ్రహాల ఊరేగింపు

రాజోళి: మండల కేంద్రంలో గణపతి, మాత పార్వతీదేవి విగ్రహాలను గురువారం ఊరేగించారు. ఫిబ్రవరి 2వ తేదీన విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం విగ్రహాలను గ్రామంలో శివ మాలధారులు, భక్తులు, స్థానికులు భజనలు చేస్తూ ఊరేగించారు.

వేరుశనగకు కనీస మద్దతు ధర ఇవ్వాలి

గద్వాల న్యూటౌన్: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు గద్వాల మార్కెట్ యార్డును సందర్శించి, వేరుశనగ రైతులు, అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేరుశనగకు గిట్టుబాటు ధరలు రావడం ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతు భరోసా మండలంలో ఒక గ్రామానికి మాత్రమే వేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధరలు కల్పించే వరకు రైతుల తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కురువ విజయ్‌కుమార్, మోనేష్, శేఖర్ నాయుడు, శ్రీరాములు, గంజిపేట రాజు, ఎండీ మాజ్, ముని, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ రాశులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాయిచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్‌గౌడ్

కేటీదొడ్డి: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాయిచూర్ రూరల్ ఎమ్మెల్యే దద్దల్ బసన్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతుగా ఎమ్మెల్యే దద్దల బసన్‌గౌడు రూ.10,01,101 ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి గ్రామంలో ఆలయాలు ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు భక్తిభావం పెరుగుతుందన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

గద్వాల న్యూటౌన్: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ జూనియర్ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్సర్‌పాష, ఇతర సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం ఈమేరకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజ్‌కు వినతిపత్రం అందించారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు జరిగే హాళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మూడు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నదని చెప్పారు. ఇది తమకు ఆర్థికంగా భారమవుతుందని వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తాము పరీక్ష కేంద్రాలు ఇవ్వమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీజేఎంఏ జిల్లా సభ్యులు నారాయణగౌడ్, రమేష్, రామారావు తదితరులు ఉన్నారు.



ఇంటర్మీడియట్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న టీపీజేఎంఏ సభ్యులు

యువత క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాలటౌన్: ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి పేర్కొన్నారు. శ్రీగుంటి చెన్నకేశవస్వామి జాతరను పురస్కరించుకొని బండల పాండు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంటవీధి ప్రీమియర్ లీగ్ సీజన్–1 క్రికెట్ పోటీలను గురువారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు, మాజీ కౌన్సిలర్ బండల పాండు, టోర్నీ ఆర్గనైజర్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు మొండిచేయి'

మల్దకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మల్దకల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు, వరికి బోనస్ రూ.500లు అని చెప్పి సగం మంది రైతులకు మాత్రమే పథకాలను అమలు చేసి, మిగితా వారిని మోసం చేశారని ఆయన ఆరోపించారు. రైతు భరోసా రెండు విడతలు రైతులకు ఇవ్వకుండా.. మూడో విడత మండలంలోని ఒక గ్రామానికి ఎంపిక చేసి అదీ ఎకరాకు రూ.6వేలు మాత్రమే వేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి మోసాలను ప్రజలు గమనించి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల పక్షపాతి అని ఆయన పేర్కొన్నారు. రైతుల అభివృద్ధి కోసం పీఎం కిసాన్ ద్వారా చిన్నకారు రైతులందరికీ రూ.600లకే కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దామ నాగరాజు, రెడ్డప్ప, గోకారి, ఈరన్నగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్, విజయ్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి



గద్వాలలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: మహాత్మా గాంధీ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అధికారులు, ఉపాధ్యాయులు, వక్తలు అన్నారు. గురువారం మహాత్ముడి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బాపూజీ వ్యక్తిత్వం, స్వాతంత్య్రోద్యమంలో ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు.

■ గద్వాల పట్టణం గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, పలు సంఘాల నాయకులు వేరువేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

■ జిల్లాకేంద్రంలోని చింతలపేట కాలనీలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్‌లోని గాంధీజీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.




అయిజ పోలీస్‌స్టేషన్‌లో..

■ గద్వాల ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, అవోపా నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిలకంటి రాము, నరహరి శ్రీను, రత్నాకర్, వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

■ అయిజ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారి, భాస్కర్, రాజు, కానిస్టేబుళ్లు గోవిందు, రవి, రాజేష్, మల్లేష్, వైకుంఠం, పుష్ప పాల్గొన్నారు.

■ ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, నర్సింహ, నాగరాజు, అల్లబకాష్, తిరుమల్, పుల్లారెడ్డి, తిరుపతి ఉన్నారు.

■ వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో యువకులు మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపాల్, కృష్ణ, శేఖర్, ఆంజనేయులు, అంజి, వెంకట్, అశోక్, మధు, బీచుపల్లి పాల్గొన్నారు.



పూలదండకు కూడా నోచుకోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్ముడి విగ్రహం

మహాత్మా.. మన్నించు!

ధరూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి ఏటా జాతిపితకు పూలమాల వేసే ఆలోచన అటు అధికారులకు, ఇటు పాలకులకు కలగడం లేదని స్థానిక అసహనం వ్యక్తం చేస్తున్నారు. గురువారం గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఉదయం నుంచి కార్యాలయంలోనే ఉన్నా.. ఒక్క పూలదండలకు నోచుకోలేదు. అధికారుల తీరుపై మండల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రగట్టు మట్టి తరలింపుపై ఎస్పీకి ఫిర్యాదు

గట్టు: చిన్నోనిపల్లి పునరావాస కేంద్రం సమీపంలోని ఎర్రగట్టు మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై గురువారం చిన్నోనిపల్లె గ్రామస్తులు ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఎర్రగట్టు మట్టిని పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్నారని, ఇప్పటికే సగం గుట్టను ఖాళీ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యవహారంపై స్థానిక అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపు వ్యవహారంపై ప్రత్యేక దృష్టిని సారించి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీఓకు సన్మానం

ఎర్రవల్లి: మండల నూతన ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ సయ్యద్‌ఖాన్‌ను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, మధునాయుడు, నాగరాజు, అల్లబకాష్, ఉమాపతినాయుడు, వెంకటేష్, ఉసేన్ తదితరులు ఉన్నారు.